సదాశివపేట : అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, నేతలు

గుమ్మడిదలలో అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న అదనపు ఎస్పీ సంజీవరావుతో కలిసి నివాళులర్పిస్తున్న స్థానికులు

జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయంలోని అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

నారాయణఖేడ్ : అంబేద్కర్, కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

అంబేద్కర్‌కు ఘన నివాళి

సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా సోమవారం అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. అంటరాని తనంపై పోరాడిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన ఆశయాలను నెరవేర్చాలని పిలుపునిచ్చారు.

-సంగారెడ్డి జిల్లానెట్ వర్క్, ఏప్రిల్ 14

ఆర్సీపురంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పటాన్‌చెరు నియోజక వర్గ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి

అందోల్ : జోగిపేటలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

సంగారెడ్డి కలెక్టరేట్ : నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బీరయ్య యాదవ్

జిన్నారంలో నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్మికులు

అమీన్‌పూర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పిస్తున్న నాయకులు



సంగారెడ్డి కలెక్టరేట్: అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్లు

కంది : ఇంద్రకరణ్‌లో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

జిన్నారం: బొల్లారం అంబేద్కర్‌నగర్ కాలనీలో నివాళులర్పిస్తున్న మాజీ జడ్పీటీసీ బాల్ రెడ్డి

మృత్యుంజయ యజ్ఞం.. అభినందనీయం

పూలమాలతో సత్కరించిన ఆశ్రమ పీఠాధిపతి

ఝరాసంగం, ఏప్రిల్ 14 : విశ్వశాంతి కోసం ప్రతినెలా బహుళ విదియ రోజున మహా మృత్యుంజయ యజ్ఞం నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని బర్దిపూర్‌లోని దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో నిర్వహించిన మృత్యుంజయ లక్ష జప యజ్ఞం, శివపార్వతుల కల్యాణానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేకు ఆశ్రమ పీఠాధిపతి అవధూతగిరి మహారాజ్ సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంకటేశం, నాయకులు సంగమేశ్వర్, రాజు, పండరినాథ్, శ్రీనివాస్ రెడ్డి, శంకర్, సిద్ధన్న పాటిల్, ఏజాజ్ బాబా, రాజేందర్, ఆశ్రమ సిబ్బంది ఉన్నారు.

పాదుక దర్శనంలో అపశృతి

■ సుడిగాలి బీభత్సంతో కుప్ప కూలిన టెంట్లు ■ 30 మందికి గాయాలు

చికిత్స పొందుతున్న క్షత గాత్రులు

సిర్గాపూర్, ఏప్రిల్ 14 : మండలంలోని వాసర్ గ్రామంలో జరుగుతున్న నరేంద్రాచార్య పాదుక దర్శనం సందర్భంగా సోమవారం అపశృతి చోటు చేసుకుంది. సుడిగాలి బీభత్సంతో మండపం టెంట్లు కుప్పకూలి 30 మందికి గాయలై సర్కారు, ప్రైవేటు దవాఖానల్లో చికిత్స పొందుతున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం జగద్గురు నరేంద్రాచార్య పాదుక దర్శనం కోసం గ్రామానికి చివర ఖాళీ స్థలంలో భారీ మండపం, టెంట్లు వేశారు. మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత వాతావరణంలో మార్పులు చోటు చేసుకొని ఒక్కసారిగా బీకర సుడిగాలి బీభత్సం సృష్టించింది. టెంట్లు కుప్ప కూలాయి. అప్పటికే కొంత మంది బయటకు పరుగులు పెట్టి వెళ్లి పోయారు. కొందరు మహిళలు, వృద్ధులు మాత్రం దాంట్లోనే ఉండిపోయారు. వీరికి బలంగా గాయాలు తగిలాయి. దాదాపు 30 మందికి గాయాలయ్యాయని గ్రామస్తులు తెలిపారు. విషయాన్ని అధికారులకు, పోలీసులకు తెలిపారు. ఈనేపథ్యంలో గ్రామానికి 108 అంబులెన్స్ వచ్చాయి. క్షతగాత్రులను నారాయణఖేడ్ సర్కారు దవాఖానకు తరలించారు. వీరిలో రాజేందర్ (65)కు కాలు విరిగి నుజ్జు నుజ్జయ్యింది. శాంతమ్మ(50) కుడి చెయ్యి విరిగి తీవ్ర గాయాలు కాగా, నారాయణఖేడ్ నుంచి సంగారెడ్డిలోని సర్కారు దవఖానకు చికిత్స నిమిత్తం తరలించారు. మరో 16 మంది మాత్రం ఖేడ్ ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. ఘటనా స్థలాన్ని సిర్గాపూర్ ఎస్సై వెంకట్‌రెడ్డి సిబ్బందితో పరిశీలించారు.

పాటిలో స్థల వివాదం.. రియల్టర్‌ను అడ్డుకున్న స్థానికులు

పటాన్‌చెరు, రూరల్, ఏప్రిల్ 14 : పాటిలో స్థల వివాదం ఏర్పడింది. ఒక రియల్టర్ రోడ్డును బ్లాక్ చేస్తున్నాడనే సమాచారం మేరకు ఆనంద్‌నగర్ కాలనీవాసులు అక్కడి కొచ్చి అడ్డుకునే ప్రయత్నం చేశారు. సోమవారం పటాన్‌చెరు మండలం పాటి గ్రామంలో ఆనంద్‌నగర్ కాలనీవాసులు సర్వేనెంబర్ 185లో ఒక రియల్టర్ వేస్తున్న రేకులతో బ్లూషీట్స్ కంపౌండ్‌వాల్‌ను అడ్డుకున్నారు. అదే సమయంలో అక్కడున్న రియల్టర్లకు, ప్లాట్ల ఓనర్లకు వాగ్వాదం జరిగింది. పరిస్థితి తోపులాటకు చేరుతున్న సమయంలో సమాచారం మేరకు పోలీసులు ఇరు వర్గాలు గొడవపడకుండా అక్కడి నుంచి పంపించివేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌నగర్ కాలనీవాసులు మాట్లాడుతూ సర్వే నెంబర్ 185లో తమ కాలనీకు చెందిన 30 పాట్లు ఉన్నాయని పేర్కొన్నారు. తమకు న్యాయం జరిగేవరకు పోరాటం ఆపమని తెలిపారు. ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీడీఎల్ సీఐ వారి వాదనలను విని ఇరు వర్గాలు ప్రభుత్వ సర్వే చేయించుకోవాలని సూచించారు. శాంతిభద్రతను భంగం కల్గిస్తే కఠినంగా వ్యవహరిస్తామని సీఐ హెచ్చరించారు.

రాజీకోసం వచ్చి భార్యను కడతేర్చిన భర్త

అడ్డొచ్చిన అత్తకు తీవ్రగాయాలు

పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 14 : గొడవపడి ఇంటినుంచి అత్తింటికి వెళ్లిన భార్యతో రాజీకోసం అని వచ్చిన భర్త రోకలిబండతో దాడి చేసి హత్య చేశారు. కూతురిని కాపాడేందుకు వచ్చిన అత్తపైన దాడి చేయడంతో అత్తకు తీవ్రగాయాలయ్యాయి. పటాన్‌చెరు పోలీసులు, గ్రామస్తులు తెలిపిన కథనం ప్రకారం.. జిన్నారం మండలం కిష్టాయిపల్లికి చెందిన సురేశ్ పెద్ద కంజర్ల గ్రామానికి చెందిన ప్రమీల(28)ను ఐదేండ్ల కింద వివాహం చేసుకున్నాడు. సురేశ్ తాగుడుకు బానిసకావడంతో భార్య ప్రమీలతో నిత్యం గొడవపడేవాడు. కొన్ని రోజుల కింద సురేశ్ భార్య ప్రమీలతో తీవ్రస్థాయిలో గొడవ పడటంతో ప్రమీల తల్లితండ్రుల వద్దకు పటాన్‌చెరు మండలం పెద్ద కంజర్లకు వచ్చింది. సురేశ్ సోమవారం అత్తగారింటికి వచ్చాడు. రాగానే భార్య ప్రమీలతో గొడవకు దిగాడు. పట్టపగలు ఆగ్రహంతో ఊగిపోయి కనిపించిన రోకలిబండతో భార్య తలపై బాదాడు. అత్త అల్లుడిని అడ్డుకునే ప్రయత్నం చేసింది. ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సీఐ వినాయక్‌రెడ్డి ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు. సురేశ్‌ను కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు కోరారు.

రజతోత్సవ సభకు తరలివెళ్దాం..

సన్నాహక సమావేశంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, ఏప్రిల్ 14 : రాష్ట్రం సాధించిన బీఆర్ఎస్ 25వ సంవత్సరంలో అడుగు పెడుతున్న సందర్భంగా ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న రజతోత్సవ సభకు ఉత్సాహంగా తరలివెళ్దామని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పిలుపు నిచ్చారు. సోమవారం నారాయణఖేడ్‌లోని వారాహి ఫంక్షన్‌హాల్‌లో నారాయణఖేడ్ మండల బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రజతోత్సవ సభను విజయవంతం చేసే దిశగా బీఆర్ఎస్ నాయకులు బాధ్యతతో వ్యవహరించి లక్ష్యానికి మించి ప్రజలు సభకు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు పరమేశ్, పటణాధ్యక్షుడు నగేశ్, మాజీ జడ్పీటీసీ రవీందర్ నాయక్, మాజీ మండల కో-ఆప్షన్ సభ్యుడు నవాబ్, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా రజతోత్సవ సభ

మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

అందోల్, ఏప్రిల్ 14 : వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోనున్నదని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. సోమవారం మండలంలోని సంగుపేట లక్ష్మీ నర్సింహా ఫంక్షన్‌హాల్‌లో పార్టీ శ్రేణులతో సన్నాహక సమావేశం ఏర్పాటుచేసి బహిరగంసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యకర్తలెవ్వరూ అధైర్య పడొద్దని ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగడుతూ ప్రజలకు అన్ని రకాలుగా అండగా ఉంటూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నేత జైపాల్‌రెడ్డి, లింగాగౌడ్, మాజీ ఎంపీపీ రామాగౌడ్, మాజీ మార్కెట్‌కమిటీ చైర్మన్ నాగభూషణం, పట్టణ అధ్యక్షుడు శ్రీధర్, నాయకులు వీరేశం, మొగులయ్య, అనిల్‌రెడ్డి, శంకర్, గోరే, శంకరయ్య, మాణిక్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, సాయికుమార్, సంతోశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులు అమ్మితే కఠిన చర్యలు

కోహీర్, ఏప్రిల్ 14 : 18 యేండ్ల వయస్సుకు తక్కువగా ఉన్న వారికి పొగాకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పొగాకు నియంత్రణ సూపర్‌వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం మండలంలోని కవేలిలో పలు దకాణాలను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ దుకాణంలో గుట్కాను కొనుగోలు చేసిన వ్యక్తికి పొగాకు ద్వారా వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. దుకాణం యజమానికి రూ. 200 జరిమానా విధించారు. దుకాణాల్లో గుట్కాలు విక్రయించడం, బహిరంగ ప్రదేశాల్లో దూమపానం చేయడం నిషేధమన్నారు. ఎవరు అతిక్రమించినా జరిమానాతో పాటు రెండేండ్ల శిక్ష పడతుందని హెచ్చరించారు. టిఫిన్ సెంటర్లు, మిఠాయి దుకాణాలు, మాంస విక్రయాల కేంద్రం వద్ద శుభ్రంగా ఉంచాలన్నారు. ఈగలు, దోమలు రాకుండా మందును పిచికారీ చేయాలని సూచించారు.

సదాశివపేటలో ప్రొటోకాల్ రగడ

సదాశివపేట, ఏప్రిల్ 14 : సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో మున్సిపల్ కమిషనర్, కాంగ్రెస్ నాయకుల మధ్య ప్రొటోకాల్ రగడ చోటు చేసుకుంది. సోమవారం అంబేద్కర్ జయంతి సందర్భంగా ముందుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాలళర్పించారు. ఎమ్మెల్యే నివాళులర్పించి వెళ్తుండగా అనంతరం అక్కడికి చేరుకున్న కాంగ్రెస్ నాయకులు కమిషనర్‌ను నిలదీశారు. తమకంటే ముందే ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పూలమాలలు వేయడంపై కాంగ్రెస్ నాయకులు మున్సిపల్ కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి వచ్చే వరకు ఆగరా అని కమిషనర్‌ను ప్రశ్నించారు. మీరు కూడా మహిళా అధికారే కదా టీజీఐఐసీ చైర్మన్ వచ్చే వరకు ఆగరా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు కమిషనర్‌పై దురుసుగా మాట్లాడారు. దీంతో కొద్దిసేపు కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ కమిషనర్ మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నది. మహిళా ఉద్యోగిపై కాంగ్రెస్ నాయకులు ఇలా మాట్లాడడం పద్దతి కాదని కమిషనర్ భావోద్వేగానికి గురయ్యారు.

బీరప్ప ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ప్రజా ప్రతినిధులు

అందోల్ మండల పరిధిలోని మాసాన్‌పల్లిలో బీరప్పస్వామి జాతర ఘనంగా కొసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి, మాజీ జడ్పీ చైర్మన్ బాలయ్య పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు.

-అందోల్, ఏప్రిల్ 14

రక్తదానం.. మహాదానం

గుమ్మడిదలలో రక్తదాన శిబిరంలో రక్తదానం చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి

గుమ్మడిదల, ఏప్రిల్14: రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వారి ప్రాణాలను రక్షిస్తుందని అదనపు ఎస్పీ సంజీవరావు అన్నారు. సోమవారం గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా స్థానిక అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు తుడుం రవి, సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి అదనపు ఎస్పీ, గుమ్మడిదల ఎస్సై మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోవర్ధన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు కుమార్‌గౌడ్, మా జీ సర్పంచ్ చిమ్ముల నర్సింహారెడ్డి, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతిపై ఇంత నిర్లక్ష్యమా !

మునిపల్లి, ఏప్రిల్ 14 : ప్రభుత్వ కార్యాలయాలు, పంచాయతీ కార్యాలయాల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 134వ జయంతిని నిర్వహించాలని ప్రభుత్వం, ఉన్నతాధికారులు సూచించినప్పటికీ సోమవారం మండల కేంద్రమైన మునిపల్లి ఎమ్ఈవో కార్యాలయంలో నిర్వహించకపోవడంపై మండల దళిత సంఘాల నాయకులు సంబంధిత అధికారుల తీరుపై అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానిక దళిత సంఘాల నాయకులు ఉన్నత అధికారులను కోరుతున్నారు. సంబంధిత ఎమ్ఈవో బీమ్‌సింగ్‌ను వివరణ కోరగా, సెలవు ఉన్నందున సంగారెడ్డిలోనే అంబేద్కర్ జయంతిలో పాల్గొన్నట్లు తెలిపారు.

డంపింగ్‌యార్డును ఉపసంహరించుకోవాలి

రిలే నిరాహారదీక్షలో పాల్గొన్న రైతు జేఏసీ నాయకులు

గుమ్మడిదల,ఏప్రిల్14: డంపింగ్‌యార్డు (ఎంఎస్‌డబ్ల్యూ)అనుమతులు ఉపసంహరించుకునే వరకు పోరు ఆగదని రైతు జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంతో పాటు నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాల్లో డంపింగ్‌యార్డు(ఎంఎస్‌డబ్ల్యూ)కు వ్యతిరేకంగా రైతు జేఏసీ నాయకులు చేస్తున్న రిలే నిరాహారదీక్షలు 69వ రోజుకు చేరుకున్నాయి. గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు దీక్షలో పాల్గొన్నారు. వీరికి రైతు జేఏసీ నాయకులు మద్దతు పలికారు. నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాల్లో చేపట్టిన రిలే నిరాహారదీక్షలో మహిళా రైతు జేఏసీ నాయకులు దీక్షలో పాల్గొని డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జేఏసీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు చిన్నపాపని కుమార్‌గౌడ్, సురభి నాగేందర్‌గౌడ్, ఆలేటిశ్రీనివాస్‌రెడ్డి, మందభాస్కర్‌రెడ్డి,తుడుం రవి. శ్రీనివాస్, రమేశ్, బాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీడీఎల్‌లో నేషనల్ ఫైర్ సర్వీస్ డే

ఫైర్ సర్వీస్ వీక్ సందర్భంగా ఫైర్ ఇంజన్‌ను ప్రారంభిస్తున్న బీడీఎల్ ఈడీ కిషన్ లునవత్

పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 14 : బీడీఎల్‌లో నేషనల్ ఫైర్ సర్వీస్ డేను బీడీఎల్ భానూర్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కిషన్ లునవత్ ప్రారంభించారు. సోమవారం పటాన్‌చెరు మండలం భానూర్ గ్రామ పరిధిలోని బీడీఎల్ సంస్థ సీఐఎస్ఎఫ్ ఫైర్‌స్టేషన్‌లో నేషనల్ ఫైర్ సర్వీస్ డే ప్రోగ్రామ్ నిర్వహించారు. సీఐఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ అర్షద్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో ఫైర్ సేఫ్టీపై కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వారం రోజుల పాటు జరిగే కార్యక్రమాల బుక్‌లెట్‌ను ఈడీ ప్రారంభించారు. ఈ సందర్భంగా బీడీఎల్ ఈడీ కిషన్ లునవత్ మాట్లాడుతూ ప్రతి కార్మికుడు ఫైర్‌తో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏజీ ఎం సంపత్ కుమార్, డీజీఎం నాగేశ్వర్‌రావు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది, బీడీఎల్ సిబ్బం ది పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతిలో పాల్గొన్న ఈడీ

బీడీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిషన్ లువత్ బీడీఎల్ సంస్థ ఎంప్లాయీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రశాంతంగా లియాఫీ ఎన్నికలు

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 14 : భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య (లియాఫీ) సర్వసభ్య సమావేశం సోమవారం సంగారెడ్డిలోని ఓ హోటల్‌లో లియాఫీ అధ్యక్షుడు స్వరూప్‌చంద్ర అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సికింద్రాబాద్ డివిజన్ లియాఫీ అధ్యక్షుడు పోతుల రామస్వామి, ప్రధాన కార్యదర్శి సునీల్ హాజరై ఏజెంట్లు, ఖాతాదారుల సమస్యలపై చర్చించారు. వాటి పరిష్కారానికి జాతీయ స్థాయిలో కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సంగారెడ్డి బ్రాంచి లియాఫీ ఎన్నికలు నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణ్ యాదవ్, కోశాధికారిగా సురేశ్‌లను ఏజెంట్లు తమ ఓటు హక్కు ద్వారా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో ఎల్ఐసీ ఏజెంట్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ టోర్నీకి అలెక్స్ హోలీ ఎంపిక

అలెక్స్ హోలీ

జహీరాబాద్, ఏప్రిల్ 14 : జాతీయ స్థాయి ఫుట్‌బాల్ టోర్నీకి జహీరాబాద్ పట్టణానికి చెందిన యువకుడు ఎంపికయ్యారు. క్రిస్టియన్ కాలనీకి చెందిన ఉపాధ్యాయుడు అమృత్ కుమారుడు అలెక్స్ హోలీ (17) పట్టణంలోని స్రవంతి జూనియర్ కళాశాలలో సెకండియర్ విద్యార్థి ప్రతిభను గుర్తించిన జిల్లా క్రీడాధికారులు జాతీయ స్థాయి ఫుట్‌బాల్ టోర్నీకి అలెక్స్ హోలీని ఎంపిక చేశారు. ఈ నెల 15 నుంచి 21వరకు మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న జాతీయ స్థాయి ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనేందుకు సోమవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి వెళ్లాడు. తల్లిదండ్రులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కల్హేర్, ఏప్రిల్ 14 : ఇటీవల కుటుంబంలో నెలకొన్న విషాదం కారణంగా కల్హేర్ మండల పరిధిలోని కృష్ణాపూర్ పీఏసీఎస్ సీఈవో బ్రహ్మం కుటుంబ సభ్యులను సోమవారం మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట మండలాధ్యక్షుడు రాంసింగ్, జిల్లా మాజీ కో-ఆప్షన్ సభ్యుడు అలీ, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణాగౌడ్, వైస్ చైర్మన్ రాంరెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, పండరి, నర్సింహులు ఉన్నారు.

వివాహ వేడుకల్లో..

నిజాంపేట్,ఏప్రిల్14: నిజాంపేట్ మండల పరిధిలో బాచెపల్లి గ్రామానికి చెందిన సాయిలు కుమారుడు శివ వివాహానికి మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి హాజరై హాజరై వధూవరులను ఆశీర్వదించారు. మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు దుర్గారెడ్డి,మాజీ సర్పంచ్ సంగయ్య, రూప్ సింగ్ నాయక్, గోపాల్ ఉన్నారు.

విద్యార్థినికి మైత్రీ ఫౌండేషన్ చేయూత

డైట్ సెట్ పుస్తకాలను అందజేస్తున్న ఫౌండేషన్ చైర్మన్ ఉదయ్ కుమార్

జిన్నారం, ఏప్రిల్ 14 : ఉన్నత చదువుకు ఆర్థిక సమస్యలు అడ్డుకాకూడదనే ఉద్దేశంతో ఓ పేద విద్యార్థినికి మైత్రి ఫౌండేషన్ అండగా నిలిచింది. జిన్నారం మండల కేంద్రానికి చెందిన అతినారం దేవిక ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసి డైట్ సెట్‌తో పాటు ఎన్డీఏ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నది. పుస్తకాలు కొనుగోలు చేయలేక స్థితిలో మైత్రి ఫౌండేషన్ ఆశ్రయించింది. ఫౌండేషన్ చైర్మన్ చెన్నం శెట్టి ఉదయ్ కుమార్ డైట్‌సెట్, ఎన్డీఏ పుస్తకాల మెటీరియల్‌ను విద్యార్థిని దేవికకు అందజేశారు. విద్యార్థినికి అండగా నిలిచిన ఫౌండేషన్ నిర్వాహకులకు కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఫౌండేషన్ సభ్యులు చెన్నం శెట్టి మౌనిక, నవీన్ సాగర్, వెంకటేశ్, గ్రా మస్తులు శ్రీశైలం యాదవ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలు అందజేత

గుమ్మడిదల, ఏప్రిల్14 : మండలంలోని కానుకుంట గ్రామ అంగన్‌వాడీ కేంద్రానికి గ్రామ యువకుడు కుర్చీలను బహూకరించారు. సోమవారం కానుకుంట గ్రామానికి చెందిన బాలు చిన్నారుల కోసం కుర్చీలను అందజేశారు. ఆయన వెంట బాబు, అంబల శేఖర్, పోతరాజు నవీన్, వై. రాజు, ఆశీర్వాదం, విక్రమ్, ఎల్లం, బాబు, ప్రసాద్, ఇమ్మానుయేల్ యూత్ సభ్యులు ఉన్నారు.

ఎందుకింత నిర్లక్ష్యం..

వారం రోజుల కింద ఈదురు గాలులకు మండల కేంద్రంలోని తహసీల్దార్, స్త్రీ శక్తి (ఐకేపీ) కార్యాలయాల మధ్య ఉన్న ఓచెట్టు కూలింది. ఈ చెట్టు కూలి స్త్రీ శక్తి భవనంపై పడింది. చెట్టు వంగి కూలేందుకు సిద్ధంగా ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

-ఝరాసంగం, ఏప్రిల్ 14

పట్టపగలే చోరీ

మనూరు, ఏప్రిల్ 14: ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తాళం పగలగొట్టి చోరీకి పాల్పడిన సంఘటన సోమవారం మధ్యాహ్నం మనూరు మండలం అతిమ్యాల్ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన గొల్ల వైద్యనాథ్ వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లగా ఆయన కుటుంబ సభ్యులు ఇతర గ్రామంలో జరుగుతున్న జాతరకు వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు పట్టపగలు తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి 8 తులాల బంగారం ఆభరణాలు, రూ.లక్ష నగదును చోరీ చేసినట్లు తెలిపారు. ఎస్సై శంకరయ్య సంఘటనా స్థలానికి చేరుకొని పరిసరాలను పరిశీలించారు. బాధితుడు వైద్యనాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.